


కిలోమీటర్ దూరం కాలినడకన వెళ్లి నీరు తెచ్చుకుంటున్న మన్నారం తండా వాసులు



# తాగునీటికి తండ్లాట

- గొంతెండుతున్న పల్లెలు
- అరకొరగానే మిషన్ భగీరథ నీటి సరఫరా
- ఎత్తిపోతున్న బోర్లు.. మొరాయిస్తున్న మోటర్లు
- బిందెడు నీటికోసం కిలోమీటర్ నడక
- పల్లెలను పట్టించుకోని సర్కారు

బాన్సువాడ, మార్చి 20: తాగునీటి కోసం తండాలు తల్లడిల్లుతున్నాయి. గుక్కెడు నీటి కోసం పల్లెలు పరితపిస్తున్నాయి. మిషన్ భగీరథ నీరు అరకొరగా సరఫరా అవుతుండడంతో జనం గొంతెండుతున్నది. భూగర్భ జలాలు అడుగంటి బోర్లు ఎత్తిపోవడం, మోటర్లు మొరాయిస్తుండడంతో తాగునీటి సమస్య రోజురోజుకూ తీవ్రమవుతున్నది. బిందెడు నీటి కోసం కిలోమీటర్ల మేర నడవాల్సిన దుస్థితి ఏర్పడుతున్నది. వేసవి ఆరంభానికి ముందే ఉమ్మడి జిల్లాలో తాగునీటి ఇక్కట్లు మొదలయ్యాయి. మార్చి మొదటి వారం నుంచి సమస్యలు మరింత తీవ్రమయ్యాయి. తాగునీరు ఇవ్వాలని ఇప్పటికే పలు గ్రామాల్లో పంచాయతీలను ముట్టడించారు. అధికారులను ఘెరావ్ చేశారు. ప్రభుత్వం స్పందించకపోతే రానున్న రోజుల్లో పరిస్థితి తీవ్రంగా మారే ప్రమాదమున్నది.

**పల్లె పల్లెన** తాగునీటి సమస్యలు నెలకొన్నాయి. మంచినీటి కోసం మహిళలు బిందెలతో పొలాల్లోని బోర్ల వద్దకు పరుగులు తీస్తున్న దృశ్యాలు పదేండ్ల తర్వాత మళ్లీ కనిపిస్తున్నాయి. తాగునీటి ఇక్కట్లు శాశ్వతంగా తొలగించాలనే లక్ష్యంతో మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ మిషన్ భగీరథ పథకానికి శ్రీకారం చుట్టారు. రూ.వేలాది కోట్లు వెచ్చించి ఊరూరికి పైపులైన్లు వేసి ప్రతి ఇంటికీ నల్లా ద్వారా నీళ్లిచ్చారు. ఇంటికే శుద్ధ జలాలు రావడంతో మహిళలకు బిందెల మోత తప్పింది. అయితే, రాష్ట్రంలో ప్రభుత్వం మారడంతో మళ్లీ తాగునీటి ఇక్కట్లు మొదలయ్యాయి. గతంలో ఉదయం, సాయంత్రం గంటల కొద్దీ వచ్చిన మిషన్ భగీరథ నీళ్లు ఇప్పుడు కొన్ని గ్రామాల్లో అసలే రావట్లేదు. మరికొన్ని చోట్ల వస్తున్నా పట్టుమని పది నిమిషాలు కూడా సరఫరా కావట్లేదు. దీంతో తాగునీటి కోసం జనం అల్లాడుతున్నారు.

## కిలోమీటర్ నడవాల్సిందే..

పెద్ద కొడప్‌గల్ మండలంలోని పోచారం తండా, కుబ్యానాయక్ తండా, విట్టల్ వాడి తండా, మన్నారం తండా వాసులు తాగునీటి కోసం కిలోమీటర్ దూరం నడవాల్సిన దుస్థితి నెలకొన్నది. బోర్ల నుంచి అరకొర నీరు వస్తుండడంతో పంటపొలాలకు వెళ్లి నీటిని తెచ్చుకుంటున్నామని స్థానికులు వాపోతున్నారు.



పోచారం తండాలో పంట పొలాల నుంచి నీరు తెచ్చుకుంటున్న తండావాసులు

## మస్తు తిప్పలైతున్నది..

తాగునీటి కోసం మస్తు తిప్పలైతున్నది. మిషన్ భగీరథ నీళ్లు సరిగా అత్తలేవు. తండాల సింగిల్ ఫేజ్ మోటర్లు, చేతి పంపులు లేవు. తాగేతందుకు నీళ్లు లేకుంటే ఎట్ల? పిల్లలను వెంటేసుకుని కిలోమీటర్ దూరం నడిచి నీళ్లు పట్టుకొచ్చుకుంటున్నం. సంగారెడ్డి జిల్లా కంగ్టి మండలంలోని తడ్కల్ గ్రామం నుంచి పెద్ద కొడప్‌గల్ మండలంలోని సముందర్ తండాకు సరఫరా అయ్యే పైపు లైన్ మ్యాన్‌హోల్ నుంచి నీళ్లు పట్టుకుంటున్నం.

**- పేల్యా సీత, మన్నారం తండా వాసి**



## తాగునీటికి కటకట

బాన్సువాడ డివిజన్‌లోని బాన్సువాడ, పెద్ద కొడప్‌గల్, పిట్లం, జుక్కల్ తదితర మండలాల్లో తాగునీటి ఇబ్బందులు తీవ్రంగా ఉన్నాయి. బాన్సువాడ మండలంకాద్లాపూర్‌లో ఉదయం కొద్దిసేపు మాత్రమే భగీరథ నీరు వస్తున్నదని, అవి ఏమాత్రం సరిపోవడం లేదని స్థానికులు చెబుతున్నారు. పంటపొలాలకు వెళ్లి బోర్ల నుంచి బిందెల ద్వారా నీళ్లు తెచ్చుకుంటున్నామని చెప్పారు. సంగ్రాం నాయక్ తండాలో భూగర్భ జలాలు అడుగంటడంతో బోరు నుంచి నీళ్లు సరిగా రావడం లేదు. వారంలో ఎత్తిపోయే అవకాశమున్నదని, రైతుల బోరును ముందే అద్దెకు తీసుకోవాలని స్థానికులు అధికారులను కోరుతున్నారు. అవాజ్‌పల్లి తండాలో సింగిల్ ఫేజ్ మోటర్ బోరులోనే పడిపోవడంతో తాగునీరు రాక ఇబ్బందులు పడుతున్నామని తండా వాసులు తెలిపారు. పెద్ద కొడప్‌గల్ మండలంలోని మన్నారం తండాలో మిషన్ భగీరథ నీరు సరిగా రావట్లేదు. దీంతో తడ్కల్ నుంచి సముందర్ తండాకు వెళ్లే దారిలో ఉన్న పైప్‌లైన్ మ్యాన్‌హోల్ నుంచి చేతులు అడ్డు పెట్టి నీటిని తెచ్చుకుంటున్నామని స్థానికులు చెప్పారు. పోచారం తండాలోనూ మిషన్ భగీరథ నీరు సరిగా రావడం లేదని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. పిట్లం మండలంలోని కాటేపల్లిలో భగీరథ నీరు రాకపోవడంతో ట్యాంకర్ ద్వారా నీళ్లు సరఫరా చేస్తున్నారు. జుక్కల్ మండలంలోని గుండూర్‌లో వారం రోజులుగా నీరు రాకపోవడంతో జీపీ కార్యదర్శిని గ్రామస్తులు ఘెరావ్ చేశారు.



జుక్కల్ మండలం గుండూర్ గ్రామంలో మిషన్ భగీరథ నీరు రాకపోవడంతో కార్యదర్శి నాగనాథ్‌ను ఘెరావ్ చేస్తున్న గ్రామస్తులు

## సమస్య పరిష్కరించాలే..



తండాలో తాగటానికి మంచి నీళ్లు లేవు. భగీరథ నీళ్లు అస్తలేవు. ఆడోళ్లు కిలోమీటర్ దూరం పోయి బిందెలల్ల మోసుకొస్తుండ్రు. పొద్దున లేవంగానే నీళ్ల కోసం నడుసుకుంట పోవాలె. రెండు, మూడు బిందెలు నెత్తిన పెట్టుకుని రావాలే. అధికారులు పట్టించుకోవాలే. మా సమస్య తీర్చాలే.

**- జాదవ్ హరీశ్‌నాయక్, మనసరాం తండా వాసి**

# క్యాసంపల్లి తండాలో కన్నీటి గోస

- అందని మిషన్ భగీరథ నీరు
- 250 కుటుంబాలకు మూడు బోర్లే దిక్కు
- పట్టించుకోని అధికారులు

కామారెడ్డి, మార్చి 20 : కామారెడ్డి మండలం క్యాసంపల్లి తండాలో తాగునీటికి కటకట నెలకొన్నది. ఇక్కడ 250 కుటుంబాలు ఉంటే మూడు బోర్లే దిక్కయ్యాయి. భూగర్భ జలాలు అడుగంటడంతో ఆ బోర్లు సరిగా పోయడం లేదు. పైపులు చెడిపోవడంతో మిషన్ భగీరథ నీళ్లు రావడం లేదు. దీంతో తాగునీటికి తండా వాసులు తీవ్ర ఇక్కట్లు ఎదుర్కొంటున్నారు. బోర్ల నుంచి ఆగి ఆగి వస్తున్న నీటి కోసం ఉదయం నుంచి మధ్యాహ్నం దాకా మహిళలు బారులు తీరుతున్నారు. కేసీఆర్ పాలనలో ఇంటింటికీ నల్లా ద్వారా భగీరథ నీరు వచ్చేదని, ఇప్పుడు చుక్క నీరు రావడం లేదని తండా వాసులు తెలిపారు. జనంతో పాటు మూగ జీవాలకు సైతం నీరు దొరకడం లేదని వాపోయారు. మార్చిలోనే ఇలా నీటి కష్టాలు ఉంటే ఏప్రిల్, మే నెలల్లో మరిన్ని ఇక్కట్లు తప్పవని వాపోతున్నారు. సమస్య పరిష్కరించాలని అధికారుల దృష్టికి తీసుకెళ్తే స్పందించడం లేదన్నారు.

## కేసీఆర్ ఉన్నప్పుడే మంచిగుండె..



తాగునీళ్ల కోసం మస్తు తండ్లాడుడు ఉన్నది. కేసీఆర్ ఉన్నప్పుడు ఏ రందీ లేకుండె. ఇంటికే నల్లా ద్వారా నీళ్లు అచ్చేటియ్. ఇప్పుడేమో నల్లలు అత్తలేవు. ఉన్న బోర్లు గట్లగట్లనే పోస్తున్నయ్. ఎండలు ముదరక ముందే గిట్లుంటే మున్ముందు ఎట్లుంటదో ఏమో భయమైతున్నది.

**- అంబి, క్యాసంపల్లి తండా**

## మస్తు కష్టమైతున్నది..



బిందెడు నీళ్లు కావాలంటే మస్తు కష్టపడాల్సి అత్తున్నది. భగీరథ నీళ్లేమో అస్తలేవు. మా తండాల 250 కుటుంబాలు ఉంటే మూడు బోర్లే ఉన్నయి. అవి కూడా సక్కగా పోస్తలేవు. పోసే కొన్ని నీళ్లు ఎందుకు సరిపోతలేవు. అధికారులు కొత్త బోర్లు ఏయించాలి.

**- తేజస్విని, క్యాసంపల్లి తండా**

## పొద్దున లేత్తే బోర్ల కాడికే..



నీళ్ల కోసం మస్తు తిప్పలైతున్నది. పొద్దగాళ్ల లేసుడుతోటే బోర్ల కాడికి పోవాలె. నాలుగైదు బిందెలు కావాలంటే పట్టపగటి దాకా అడనే ఉండుడు అయితున్నది. పనులు ఇడ్స వెట్టుకుని నీళ్ల కోసం ఉంటున్నం. రోజూ గిట్లనే అయితే ఎట్ల బతకాలే. ప్రభుత్వమే పట్టించుకోవాలే.

**- భుక్యా లక్ష్మి, క్యాసంపల్లి తండా**



క్యాసంపల్లి తండాలో సన్నటి ధారగా వస్తున్న నల్లా వద్ద బిందెలు, బకెట్లతో మహిళలు

# బడ్జెట్ ప్రతుల దహనం

బడ్జెట్‌లో విద్యారంగానికి 15 శాతం నిధులు కేటాయిస్తామని హామీ ఇచ్చి, కేవలం 7.57 శాతం కేటాయించడంపై పీడీఎస్‌యూ టీయూ నాయకులు ఆగ్రహం వ్యక్తంచేశారు. ఈ మేరకు టీయూలో బడ్జెట్ ప్రతులను గురువారం దహనం చేశారు. విద్యారంగానికి 20 శాతం నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. –డిచ్‌పల్లి, మార్చి 20




# ముగిసిన ఇంటర్ పరీక్షలు



ఖలీల్‌వాడి/ కామారెడ్డి, మార్చి 20 : ఉమ్మడి జిల్లాలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం పరీక్షలు గురువారం ముగిశాయి. ఒకేషనల్ బ్రిడ్జి కోర్సు పరీక్షలు ఈ నెల 22న ముగుస్తాయని నిజామాబాద్ జిల్లా ఇంటర్ విద్యాధికారి రవికుమార్ తెలిపారు. చివరి రోజు కెమిస్ట్రీ, కామర్స్ పరీక్షలు ప్రశాంతంగా జరిగాయని పేర్కొన్నారు. జిల్లా వ్యాప్తంగా 15,896 మంది విద్యార్థులకు 15,458 మంది హాజరుకాగా, 438 మంది గైర్హాజరైనట్లు తెలిపారు. కామారెడ్డి జిల్లాలోజనరల్ 6,928 మంది విద్యార్థులకు 6,780 మంది హాజరుకాగా, 148 మంది గైర్హాజరైనట్లు ఇంటర్ నోడల్ అధికారి షేక్ సలాం తెలిపారు. ఒకేషనల్ 1,093 మంది విద్యార్థులకు 1,042 మంది హాజరుకాగా, 51 మంది గైర్హాజరైనట్లు పేర్కొన్నారు.



లగేజీతో ఇంటికి..

# నేటి నుంచి టెన్త్ ఎగ్జామ్స్

## ఏర్పాట్లు పూర్తిచేసిన అధికారులు



ధర్పల్లిలోని పరీక్షా కేంద్రంలో హాల్‌టికెట్ నంబర్లు వేస్తున్న అధికారులు

కామారెడ్డి/ఖలీల్‌వాడి, మార్చి 20 : పదో తరగతి వార్షిక పరీక్షలు నేటి నుంచి ప్రారంభం కానున్నాయి. ఈ పరీక్షలు ఏప్రిల్ 4వరకు నిర్వహించనున్నారు. పరీక్షలు ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు కొనసాగనున్నాయి. పరీక్షలను పకడ్బందీగా నిర్వహించడానికి ఉమ్మడి జిల్లాలో అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తిచేశారు. కామారెడ్డి జిల్లా వ్యాప్తంగా 62 కేంద్రాలను ఏర్పాటు చేయగా.. మొత్తం 12,579 మంది (6,127 మంది బాలురు, 6,452 మంది బాలికలు) పరీక్షలు రాయనున్నారు. నిజామాబాద్ జిల్లాలో 141 పరీక్షా కేంద్రాలను ఏర్పాటుచేసినట్లు డీఈవో అశోక్ తెలిపారు. మొత్తం రెగ్యులర్ 22,657 మంది విద్యార్థులు (11,418 మంది బాలురు, 11,239 మంది బాలికలు) పరీక్షకు హాజరుకానున్నట్లు పేర్కొన్నారు. ఉమ్మడి జిల్లాలోని అన్ని పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలులో ఉంటుందని అధికారులు తెలిపారు. తొలిసారిగా విద్యార్థులకు 24 పేజీల బుక్‌లెట్ ఇవ్వనున్నారు. విద్యార్థులు ఆయా పేజీల్లోనే రాయాలి. పేపర్ లీకేజీని అరికట్టేందుకు ప్రశ్నపత్రాలపై మొదటిసారిగా క్యూఆర్‌కోడ్‌ను ముద్రిస్తున్నారు.

# హామీలను తుంగలో తొక్కిన కాంగ్రెస్

- పథకాల అమలుపై ప్రభుత్వాన్ని పోచారం ఎందుకు ప్రశ్నించడంలేదు?
- బీఆర్ఎస్ నాయకుడు, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ జుబేర్ ఆగ్రహం



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ షేక్ జుబేర్

బాన్సువాడ, మార్చి 20 : ఎన్నికల సమయంలో ప్రజలు, రైతులు, యువతకు ఇచ్చిన హామీలన్నింటినీ కాంగ్రెస్ ప్రభుత్వం తుంగలోకి తొక్కిందని బీఆర్ఎస్ నాయకుడు, బాన్సువాడ మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ జుబేర్ మండిపడ్డారు. బాన్సువాడలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ కల్యాణలక్ష్మితోపాటు తులం బంగారం, ఉపాధి కూలీలకు ఏడాదికి రూ.12 వేలు, కౌలు రైతులకు రూ.12వేలు, విద్యార్థినులకు స్కూటీలు ఇస్తామని హామీలు ఇచ్చి, బుధవారం అసెంబ్లీలో ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో నిధులు కేటాయించలేదని ఆగ్రహం వ్యక్తంచేశారు. ఇందిరమ్మ ఇండ్లకు బడ్జెట్‌లో నిధులు కేటాయించినా ఇప్పటివరకూ ఎక్కడా కట్టిందిలేదని, నిర్మిస్తే చూపాలని సవాల్ విసిరారు.

**నియోజకవర్గానికి పోచారం, కాసుల చేసిందేమీలేదు..**

బాన్సువాడ నియోజకవర్గంలో రూ.2 లక్షల రుణమాఫీ కొంతమంది రైతులకే చేశారని తెలిపారు. సాగునీరులేక పంటలు ఎండుతుంటే, నియోజకవర్గంలో ముగ్గురు నాయకులు ఉండి ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. బీఆర్ఎస్ నుంచి గెలిచి కాంగ్రెస్ పార్టీలో చేరిన పోచారం.. రైతు రుణమాఫీ, బోనస్, రైతుభరోసా తదితర అంశాల పై అసెంబ్లీలో నోరు ఎందుకు విప్పడం లేదని ప్రశ్నించారు. బాన్సువాడను జిల్లా చేయాలని రాష్ట్ర ఆగ్రో ఇండస్ట్రీస్ కార్పొరేషన్ చైర్మన్ కాసుల బాల్‌రాజ్ పలుమార్లు ఉద్యమించారని, ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం ఉన్నదని బాన్సువాడను జిల్లాగా ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ముగ్గురు నాయకులు.. వర్గాలను ప్రోత్సహిస్తున్నారే తప్ప, రైతాంగానికి వారు చేసిందేమీలేదని విమర్శించారు. బీఆర్ఎస్ పార్టీ నాయకులు సాయిబాబా, మోచి గణేశ్, అఫ్రోజ్, రమేశ్ యాదవ్, గాండ్ల కృష్ణ, శంకర్, నర్సింహులు గౌడ్, మొగులయ్య, రాములు, బాలయ్య, అంజయ్య, విఠల్, జీవన్‌కుమార్, అనిల్ కుమార్, రాజుకుమార్ పాల్గొన్నారు.

# దూసుకొచ్చిన మృత్యువు

- గాంధారిలో కారు బీభత్సం
- ఇద్దరు కానిస్టేబుళ్లను ఢీకొట్టిన వాహనం
- ఒకరు అక్కడికక్కడే మృతి.. మరొకరికి తీవ్ర గాయాలు
- తెల్లవారుజామున పెట్రోలింగ్ చేస్తుండగా ఘటన
- మృతుడి కుటుంబాన్ని పరామర్శించిన ఎస్పీ

గాంధారి/ కామారెడ్డి, మార్చి 20: గాంధారి మండల కేంద్రంలో ఓ కారు బీభత్సం సృష్టించగా.. ఒకరు దుర్మరణం చెందారు. పెట్రోలింగ్ నిర్వహిస్తున్న రవి కుమార్, సుభాష్ అనే ఇద్దరు కానిస్టేబుళ్లపైకి అతివేగంగా కారు దూసుకురావడంతో రవి కుమార్ అక్కడికక్కడే మృతి చెందగా.. సుభాష్ గాయపడ్డాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గాంధారి పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న కానిస్టేబుళ్లు రవి కుమార్ (38), సుభాష్ గురువారం తెల్లవారుజామున 3 గంటల ప్రాంతంలో పెట్రోలింగ్ నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో బస్టాండ్ సమీపంలోని ఓ టిఫిన్ సెంటర్ వద్ద బైక్‌ను నిలిపి నిల్చున్నారు. అదే సమయంలో కామారెడ్డి వైపు నుంచి అతి వేగంగా ఓ కారు (టీఎస్ 09 ఈఏ 9495) వీరిపైకి దూసుకువచ్చింది. రెప్పపాటులో జరిగిన ఈ ప్రమాదంలో కానిస్టేబుల్ రవి కుమార్ అక్కడిక్కడే మృతి చెందగా.. మరో కానిస్టేబుల్ సుభాష్ స్వల్పగాయాలతో తృటిలో తప్పించుకున్నాడు. విషయం తెలుసుకున్న గాంధారి ఎస్సై ఆంజనేయులు ఘటనా స్థలికి చేరుకొన్నారు. రవి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కామారెడ్డి జిల్లా దవాఖానకు తరలించారు. బీభత్సం సృష్టించిన కారు దృశ్యాలు సమీపంలోని సీసీ కెమెరాల్లో రికార్డయ్యాయి. అతి వేగంగా కారు నడిపిన సన్నిత్ అనే యువకుడిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.



రవికుమార్ మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న పోలీసులు



రవికుమార్ (ఫైల్)

**పోలీసు లాంఛనాలతో అంత్యక్రియలు**

కానిస్టేబుల్ రవికుమార్ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కామారెడ్డి జిల్లా ప్రభుత్వ దవాఖానకు తరలించగా.. ఎస్పీ రాజేశ్‌చంద్ర, స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ తిరుపయ్య, పట్టణ సీఐ చంద్రశేఖర్ రెడ్డితో కలిసి సందర్శించి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తంచేశారు. బాధిత కుటుంబీకులతో మాట్లాడి సంతాపం తెలిపారు. విధి నిర్వహణలో రవికుమార్ మృతిచెందడం డిపార్ట్‌మెంట్‌కు తీరని లోటని పేర్కొన్నారు. రవి కుటుంబానికి పోలీసు వ్యవస్థ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. డిపార్ట్‌మెంట్ నుంచి రావాల్సిన అన్ని రకాల బెనిఫిట్స్ త్వరలోనే కుటుంబ సభ్యులకు అందజేస్తామని తెలిపారు. అంత్యక్రియలకు పోలీసు శాఖ తరఫున ఆర్ఐ నవీన్ కుమార్ రూ. 30 వేలు కుటుంబీకులకు అందజేశారు. కామారెడ్డి మున్సిపల్‌పరిధిలోని దేవునిపల్లిలో పోలీసు లాంఛనాలతో రవికుమార్ అంత్యక్రియలు నిర్వహించగా..ఎల్లారెడ్డి డీఎస్పీ శ్రీనివాస్‌రావు, సదాశివనగర్ సీఐ సంతోష్‌కుమార్, గాంధారి ఎస్సై ఆంజనేయులు, కానిస్టేబుళ్లు, జిల్లా పోలీసు సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

**పెద్దదిక్కును కోల్పోయిన కుటుంబం**

ప్రమాదంలో మృతిచెందిన కానిస్టేబుల్ వడ్ల రవి కుమార్ స్వస్థలం తాడ్వాయి మండలం దేమే గ్రామం. కామారెడ్డి మున్సిపల్ పరిధిలోని దేవునిపల్లిలో ఇల్లు కట్టుకొని నివాసం ఉంటున్నాడు. ఆయనకు భార్య, ఇద్దరు కూతుళ్లు, ఒక కుమారుడు ఉన్నారు. రవి కుమార్ మృతితో కుటుంబం పెద్ద దిక్కును కోల్పోయిందంటూ బంధువులు రోదించడం అక్కడున్నవారిని కంటతడి పెట్టించింది.